క్లుప్తంగా

నేడు పాఠశాలల బంద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొని ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ ఏలూరు జిల్లా కన్వీనర్ నగుళ్ళ నాగబాబు తెలిపారు. మంగళవారం స్థానిక విద్యావికాస్ పాఠశాలలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజులు, పుస్తకాలు, యూనిఫారంల పేరిట చేస్తున్న దోపిడీని అరికట్టాలని, విద్యా వ్యాపారాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన వలంటీర్ల ఇంటర్వ్యూలు

ఏలూరు రూరల్ : ఏలూరు మండల గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి చెప్పారు. మొత్తం ఖాళీగా ఉన్న 22 పోస్టులకు 60 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. బుధవారం ఎంపికైన వలంటీర్ల వివరాలు వెల్లడిస్తామని, వారు 6వ తేదీన ఒకరోజు శిక్షణ పూర్తి చేసుకుని, 8వ తేదీ నుంచి విధుల్లో చేరతారన్నారు.

నేడు మల్కాపురంలో జగనన్న సురక్ష

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం మల్కాపురంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక సచివాలయం వద్ద ఎస్సీ కమ్యూనిటీహాలులో అధికారులు ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. మండల ప్రత్యేక అధికారి, డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సరళకుమారితో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొంటారు.

ఆకతాయి చేష్టలు చేస్తే సహించేది లేదు

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలోని పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిలు అల్లరి చేస్తే చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ ఎస్సై కే.ప్రసాద్ హెచ్చరించారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాలతో ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో స్కూల్, కాలేజీల వద్ద ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి వారితో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సమాజంలో మర్యాదగా నడుచుకోవాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే, ఆకతాయి చేష్టలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్కూల్, కాలేజీ విద్యార్థినిలను వేధింపులకు పాల్పడితే చట్టం మేరకు చర్యలు ఉంటాయన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందనీ, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి ప్రవర్తనపై దృష్టి సారించాలని ఎస్సై ప్రసాద్ తల్లిదండ్రులకు సూచించారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహించిన ఈ పరీక్షల్లో డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 36 మందికి గాను 12 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు 34 మందికి గాను 28 మంది హాజరు కాగా 6గురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

నాటు సారా పట్టివేత

జంగారెడ్డిగూడెం : నాటు సారా విక్రయాలపై వచ్చిన సమాచారం మేరకు పంగిడిగూడెంలో మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఏఎస్సై ఎం.గంగాధరరావు తెలిపారు. ఈ దాడుల్లో దొమ్మేటి రమణ అనే వ్యక్తి విక్రయించడానికి ఉంచిన 7 లీటర్ల నాటు సారా గుర్తించామన్నారు. దీంతో రమణను అరెస్టు చేసి అతని వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పండుగలా... జగనన్న సురక్ష

- ఏలూరు కబాడీగూడెంలో తొలి క్యాంపు
- 5 సచివాలయాల పరిధిలో 2,942 మందికి సర్టిఫికెట్లు
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని చేతులమీదుగా పంపిణీ



ఏలూరు ఎంఆర్‌సీ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం పండుగలా జరిగింది. తమ కుటుంబాల్లోని చిన్నపాటి సమస్యను సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపటం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కబాడీగూడెంలో జగనన్న సురక్ష మొదటి క్యాంపు మంగళవారం చేపట్టారు. ఎంఆర్‌సీ కాలనీ 1, 2 యాదవనగర్ 1, 2, తాపీమేస్త్రీ కాలనీ సచివాలయాలకు సంబంధించి లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్లనాని చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు రాసిన లెటర్‌ను కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ చదివి వినిపించారు. నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ జగనన్న సురక్ష కార్యక్రమం విశిష్టత, ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆళ్లనాని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి, అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను ఆరా తీశారు. క్యాంపు వద్దనే ఇంకా ఎవరైనా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. 50వ డివిజన్‌లోని ప్రతి ఒక్క వ్యక్తికీ లబ్ధి చేకూర్చేలా నాయకులు చర్యలు చేపట్టారు.

ఏలూరు కబాడీగూడెంలో జగనన్న సురక్ష ఇలా :		
జగనన్న సురక్షలో అర్జీలు	-	3126
మొత్తం సర్టిఫికెట్లు మంజూరు	-	2942
కుల ధ్రువీకరణ పత్రాలు	-	1991
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	-	532
ఆధార్ అప్‌డేట్	-	385
రైస్ కార్డుల మంజూరు	-	17
రైస్ కార్డులో చేర్పులు	-	11
కొత్తగా రైస్ కార్డులు	-	02
ఫ్యామిలీ స్ప్లిట్టింగ్	-	03
కార్డులో వ్యక్తి తొలగింపు	-	01
పరిష్కరించాల్సిన అర్జీలు	-	184

సేవలు సంతృప్తిగా ఉన్నాయి



నేను ఏలూరు సీఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో చదువుతున్నాను. మా కుటుంబంలో అమ్మ, నాన్న, అన్నయ్య, నాకు కలిసి క్యాస్ట్ సర్టిఫికెట్లు తీసుకున్నాను. గతంలో మాదిరిగా అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా వెంటనే సర్టిఫికెట్ తీసుకోవటం బాగుంది. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడతాయి.

– జే.నాగమోహన్, డిగ్రీ విద్యార్థి, ఏలూరు

మంచి నిర్ణయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు ఏమి అవసరమో తెలుసుకుని మరీ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయటం చాలా బాగుంది. గతంలో సర్టిఫికెట్లు కోసం చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు మా ఇంట్లో పిల్లలకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాను. మొన్న ఇంటికి వచ్చినప్పుడు అధికారులకు దరఖాస్తు చేశాం. ఇప్పుడు కార్యక్రమంలో సర్టిఫికెట్లు చేతికి ఇచ్చి పంపుతున్నారు.

– కె.అన్నపూర్ణ, పుష్పలీలానగర్

సీఎం జగన్ పాలన బాగుంది



సీఎం వైఎస్ జగన్ పాలన చాలా బాగుంది. గతంలో తహసీల్దార్ కార్యాలయం, వీఆర్వో ఇలా అధికారుల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎప్పటికో సర్టిఫికెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఏకంగా వలంటీర్, గృహసారథి, సచివాలయ సిబ్బంది, కార్పొరేషన్ అధికారులు ఇంటికే వచ్చి మీకు ఏమి కావాలి అని అడిగి మరీ సర్టిఫికెట్లు చేతికి ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదు.

– జే. విక్టోరియా రాణి, ఏలూరు

సర్వీస్ బాగుంది



ప్రభుత్వ అధికారుల సర్వీస్ బాగుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జవాబుదారీతనం మెరుగుపడింది. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే గతంలో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు చాలా అవసరం. ఇప్పుడు వలంటీర్, గృహసారథి, సచివాలయ సిబ్బంది, నాయకులు ఇంటికే వచ్చి మాకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

– పి.నాగప్రేమ దీక్షిత్, డిగ్రీ విద్యార్థిని, ఏలూరు

కాంట్రాక్టు సిబ్బందికి బకాయిలు చెల్లించాలి



ఏలూరు కమిషనర్ వెంకటకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం నగర కమిషనర్ వెంకటకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల ఎరియర్స్‌కు సంబంధించి గతంలో కొంత సొమ్మును చెల్లించారని పెండింగ్‌లో ఉన్న మిగిలిన సొమ్మును విడుదల చేయాలని కోరారు. కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల ఉద్యోగ సిబ్బందికి బకాయిపడ్డ ఒక నెల జీతం ఇప్పించాల్సిందిగా కోరారు. ఏలూరు కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తూ మరణించిన కార్మికులకు సంబంధించి గత మూడు మాసాలుగా మట్టి ఖర్చులు కూడా చెల్లించడానికి , బిల్లులు పెట్టడానికి ఈ1 గుమస్తా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ దృష్టికీ తీసుకు వచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, ఏ.అప్పలరాజు, బి.నారాయణరావు, ఎస్ఎంవీ సుబ్బారావు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

ఏలూరు(మెట్రో) : స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు ఒక మార్గదర్శిగా నిలిచారని డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి డీఆర్వో, అధికారులు నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో మూర్తి మాట్లాడుతూ అతి పిన్న వయసులోనే దేశం కోసం త్యాగం చేసి స్వతంత్ర స్ఫూర్తిని రగిల్చిన వ్యక్తిగా అల్లూరి సీతారామరాజు చరిత్రలో నిలిచి పోయారని పేర్కొన్నారు. ఇలాంటి వీరుల గాథలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అల్లూరి సీతారామరాజులోని నాయకత్వ లక్షణాలను, వారి త్యాగ స్ఫూర్తిని, దేశ భక్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. యువత నిస్వార్థంగా ఆలోచించి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ ఉద్యోగులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన మన్యం ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. మన్యం ప్రజలు చూపిన పోరాట పటిమను మనందరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ఓసీ ఉద్యోగ సంఘం నాయకులు తురగా రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన యోధుడు అని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్ టీ.శశిధర్, ఏ.రఘునాథ బాబు, ఎం.ఝాన్సీ, ఎస్ఏఓ కే.సత్య కిషోర్, ఏఓలు, పీ .శ్రీనివాస్, కే.గౌరి, నాయకులు సీహెచ్ సాయిబాబా, ఎం.రమేష్, పీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రజక చెరువులను ఇళ్ల స్థలాలకు ఇవ్వడం తగదు



రజక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొద్ది గ్రామాలలో రజకుల చెరువులను ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి రెవెన్యూ యంత్రాంగం కసత్తు చేయడం దురదృష్టకరమని రజక జన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకివీడు మండలం కోళ్ళపర్రులో రజకులకు అప్పటి సర్పంచ్ వసంతరావు 2002లో 69 సెంట్ల స్థలం గల చెరువును ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కేటాయించారన్నారు. అప్పటి నుంచి రజకులు ఆ చెరువులో రజక వృత్తి నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం చెరువును ఇళ్ల స్థలాలకు కేటాయించడం రజకులకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా రజకులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యువజన సంఘం కార్యదర్శి విశాల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ దుర్గయ్య, కోళ్లపర్రు రజక నేతలు పెరుమాళ్ల పెద్దిరాజు, ఏసుబాబు, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ రథాన్ని లాగి యాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక అశోక్ నగర్‌లోని శ్రీ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు, ఏలూరు నగర పాలక సంస్థ కో – ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పూరి జగన్నాథ్ ఆలయంలో నిర్వహించే సంప్రదాయం ప్రకారం బంగారు చీపుర్లతో రథయాత్ర మార్గాన్ని శుభ్రం చేశారు. అనంతరం స్వామివారి రథయాత్రను ప్రారంభించారు. అశోక్ నగర్ జగన్నాథ మందిరం నుంచి ప్రారంభమైన రథయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా రామకోటి వరకు హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తనతో సాగింది. ఏలూరులో నిర్మించే జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి తపన ఫౌండేషన్ తరపున తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా గారపాటి చౌదరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతార్లంక లక్ష్మణరావు, గొల్లపూడి శ్రీ జగన్నాథ మందిరం ప్రెసిడెంట్ దయానిధి దాస్ ప్రభు జీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



వంగవీటి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లాపరిషత్, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సెంటర్, మెయిన్ బజార్ పార్కుల వద్ద ఉన్న వంగవీటి రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు రంగా చరిత్రను వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా రంగా పనిచేసేవారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రంగా విగ్రహ నిర్మాణకర్త సదాబత్తుల రాజేష్ నాయుడును పలువురు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సంఘం నాయకులు వాసా రాజు, నాగం శివ, యడ్లపల్లి ప్రసాద్, తన్నీరు బుజ్జి, నడపన దాన భాస్కరరావు, బర్మా లక్ష్మణరావు, కొప్పిశెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ



డెంగీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చింతలపూడి : డెంగీ వ్యాధి నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. జూలై 1 తేదీ నుంచి 31 వరకు నిర్వహించే మలేరియా మాసోత్సవం పురస్కరించుకుని చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిల్వ ఉన్న మంచినీటిలో పుట్టే దోమల వలన డెంగీ వ్యాప్తి చెందుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు ఇంటి లోపల, ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ, అధికారుల సమన్వయంతో దోమల నివారణకు చర్యలు యాంటి లార్వా, ఫాగింగ్, స్ప్రేయింగ్ లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యం.సురేష్ బాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.వెంకటేశ్వరరావు, హెచ్‌వీ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చట్టపరంగా పరిష్కరించేలా పోలీస్ అధికారులు పనిచేయాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు అన్నారు. మండలంలోని లక్కవరం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్సై దుర్గా మహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందికి డీఎస్పీ పలు సూచనలు చేశారు. స్టేషన్‌కి వచ్చే ప్రజలతో స్టేషన్ సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలన్నారు. జూద క్రీడలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

7న విజయవాడలో మాదిగల జనజాగృతి సభ

పెదపాడు: ఈనెల 7న విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మాదిగల జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఆ సామాజిక వర్గ నేతలు పిలుపు నిచ్చారు. మంగళవారం పెదపాడు మండలంలోని వసంతవాడ కమ్యూనిటీ హాల్‌లో యందం నాగరాజు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ పలివేలు చంటి, ఎమ్మార్పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొట్టేటి స్టాలిన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గొట్టేటి స్టాలిన్ మాట్లాడుతూ మాదిగ ఉద్యమకారులపై ఉన్న కేసులు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. మానికొండ పరిశోధం, కోకటి శ్రీను, ఇంటూరి బాబు, కందికంటి రమేష్, గొల్లపల్లి మోషే, కలపాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు సత్యనారాయణకు నివాళి

ఏలూరు (టూటౌన్) : సీఐటీయూ జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కార్మికోద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ 9వ వర్ధంతిని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సత్యనారాయణ చిత్రపటానికి బి.సోమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ అల్లూరు సత్యనారాయణ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీఐటీయూను నిర్మించేందుకు విశేష కృషి చేశారన్నారు. రైస్ మిల్లు, బజారు జట్ల కార్మికులు, హమాలీ, ఫ్యాక్టరీ, జూట్‌మిల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘం ఏర్పాటు చేసేందుకు ఎనలేని సేవలందించారన్నారు. అల్లూరు సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల సాధనకు కార్యకర్తలంతా నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వి.సాయిబాబు, పి.హైమావతి, కె.విజయలక్ష్మి, కె.రామాంజనేయులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

స్వామి వివేకానందుడు ఆదర్శనీయుడు

భీమడోలు: స్వామి వివేకానందు ఆదర్శనీయుడని, ఆయన బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలులో స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు, వైసీపీ నేత సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వివేకానందుని వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, సొసైటీ డైరెక్టర్ భాస్కరరావు, వైసీసీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, రిటైర్డ్ హెచ్ఎం తుమ్మల ఉమామహేశ్వరరావు, పెద్దలు ఈడే సత్యనారాయణ, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మన్యం వీరుడు, అల్లూరి సీతారామరాజు జయంతిని, స్వామి వివేకానందుని వర్ధంతి నిర్వహించారు.వారి చిత్రపటాలకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వలంటీర్లకు స్టార్‌టెక్ పరికరాల అందజేత

గణపవరం: ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ చేరవేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లకు ఉపయోగపడే విధంగా ఓదాత స్టార్‌టెక్ పరికరాలను అందజేశారు. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన హోమియో వైద్యుడు దేవరకొండ సుబ్రహ్మణ్యశాస్త్రి గ్రామంలోని వలంటీర్లకు వీటిని అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చనుమూరి శివ చేతులమీదుగా గ్రామ కార్యదర్శి డైబాల రామాంజనేయులుకు వీటిని అందజేశారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం

పోలవరం రూరల్ : పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగుల ఉపకరణాలు, సహాయ పరికరాలకు సంబంధించిన ఎంపిక శిబిరం బుధవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. పోలవరం మండలంలోని దివ్యాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరన్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలతో ఈ శిబిరానికి హాజరుకావాలన్నారు.

స్థల ఆక్రమణ వినతిపై స్పందించిన హైకోర్టు

నిడమర్రు: బావాయిపాలెంలో తన స్థలాన్ని స్థానికంగా ఉండే కొందరు ఆక్రమించారని వినియోగదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య హైకోర్టుకు తన వినతి పంపించగా న్యాయస్థానం స్పందించినట్లు తెలిపారు. రాష్ట్ర లీగల్ అథారిటీ ద్వారా 15 రోజుల్లో చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదారి జిల్లా కలెక్టర్‌కు న్యాయస్థానం సూచించింది. కొన్ని నెలలుగా స్థల ఆక్రమణ విషయం అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు వినతి పంపినట్లు తెలిపారు.